వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి ఈ నెల 4న ఇంటర్వ్యూలు

- జాతీయ ఆరోగ్య మిషన్ కింద 10 పోస్టుల భర్తీ, ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు.
- వైద్యాధికారికి రూ.52 వేలు.. నిపుణులకు రూ.లక్ష వేతనం.



2

తెహెల్కా

ప్రతి వార్త సంచలనం





నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం 2 నవంబర్ 2026 పేజీలు : 4

ఓటు హక్కు పరిరక్షణకు ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరి



- రామ్‌లీలా మైదానంలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' మహా ర్యాలీ.
- సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న మహమ్మద్ అలీ షబ్బీర్.
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఇండియా కూటమి నేతల డిమాండ్.
- ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్.
- రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలు పార్టీల నేతల హాజరు.
- తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

2

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి

- 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో మంత్రి సీతక్కతో ఇప్ప శ్రీనివాస్.
- ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యక్రమం.
- కామారెడ్డి జిల్లా నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు.

కామారెడ్డి, నవంబర్ 1, (తెహెల్కా న్యూస్)

ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువల ను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ 'ఓట్ బచావో-దేశ్ బచావో' ఉద్యమంలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇప్ప శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు.



కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన గంపగోవర్ధన్





- పొండుర్తి వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఘనస్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పొండుర్తి వద్ద స్వాగత కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్‌కు ఎదురేగి కండువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముజీబొద్దీన్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కేటీఆర్ రాకతో పొండుర్తి వద్ద పార్టీ శ్రేణుల్లో సందడి నెలకొంది.

ఓటు హక్కు పరిరక్షణకు ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరి

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

దేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' ఉద్యమం ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో భారీ స్థాయిలో సాగింది. ఢిల్లీ పిలుపులో భాగంగా చారిత్రక రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన మెగా ర్యాలీకి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఇండియా కూటమి నేతలు కార్యక్రమానికి హాజరు

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఇతర ఇండియా కూటమి నేతలు కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత మింటో రోడ్--కనాట్ ప్లేస్ ప్రాంతం నుంచి అగ్రనేతలు బహిరంగ వాహనంలో రామ్‌లీలా మైదానం వైపు సాగారు. వారికి తోడుగా కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో నినాదాలు చేస్తూ ప్రదర్శనగా ముందుకు కదిలారు. అనంతరం మైదానంలో జరిగిన సభలో నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

స్వతంత్ర దర్యాప్తుకు డిమాండ్

ఎన్నికల సంఘం అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు చేస్తున్నారనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, ఆయనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

నినాదాలు.. నేతల ప్రసంగాలతో రామ్ లీలా మైదానం

రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల జెండాలు, బ్యానర్లు, ప్లకార్డులతో సభా ప్రాంగణం సందడిగా మారింది. ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, సీఈసీ రాజీనామా కోరుతూ కార్యకర్తలు నినాదాలు చేశారు. మహిళలు, యువత, దళితులు సహా అన్ని వర్గాల ఓటు హక్కును కాపాడాల్సిన అవసరాన్ని నేతలు తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించబడినట్లు భావిస్తున్నవారికి న్యాయం జరగాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాలని కోరారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు పోరాటం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. రాహుల్ గాంధీ తదితర నేతలు కూడా ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని ప్రజాస్వామ్యానికి సంబంధించిన కీలక అంశంగా ప్రస్తావించారు.

తెలంగాణ నుంచి భారీగా తరలింపు

తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులకు ప్రాతినిధ్యం వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఢిల్లీలోని తెలంగాణ భవన్, ఇతర వసతి కేంద్రాలు సందడిగా మారాయి.

ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంపొందించడం, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడం ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి

ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన శక్తివంతమైన ఆయుధం–ఇప్ప శ్రీనివాస్

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ఆ హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని, దేశ భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని అన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇలాంటి ఉద్యమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచే ఓటు హక్కును కాపాడుకోవడానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథాల య సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, రాజ్‌పాటిల్, గొనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, నాగరాజుగౌడ్, పాత రాజు, శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి ఈ నెల 4న ఇంటర్వ్యూలు

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

జాతీయ ఆరోగ్య మిషన్ కింద కామారెడ్డి జిల్లాలో వైద్యాధికారులు, వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి ఈ నెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. తాత్కాలిక ఒప్పంద ప్రాతిపదికన మొత్తం 10 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆదివారం వెల్లడించారు. ఖాళీల్లో మత్తుమందుల వైద్య నిపుణులు రెండు, వైద్యాధికారి ఒకటి, స్త్రీ వైద్య నిపుణులు మూడు, చిన్నపిల్లల వైద్య నిపుణులు ఒకటి, చిన్నపిల్లల వైద్య నిపుణులు/వైద్యాధికారులు రెండు, మానసిక వైద్య నిపుణుల పోస్టు ఒకటి ఉన్నాయి. వైద్యాధికారి పోస్టుకు నెలకు రూ.52 వేలు, వైద్య నిపుణులకు రూ.లక్ష చొప్పున వేతనం చెల్లించనున్నారు.

ఇంటర్వ్యూ వివరాలు

ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, గది నంబరు 105లో ఇంటర్వ్యూలు ప్రారంభమ వుతాయి. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలు, తెలంగాణ వైద్య మండలి నమోదు పత్రం, ఇతర ధ్రువపత్రాల అసలు ప్రతులతో హాజరుకావాలి. అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసి సమర్పించాలి.

దరఖాస్తు రుసుము రూ.500

దరఖాస్తు రుసుము రూ.500ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కామారెడ్డి పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. మరిన్ని వివరాలు, దరఖాస్తు కోసం(www.kamareddy.telangana.gov.in) వెబ్‌సైట్‌ను సందర్శించాలని కలెక్టర్ సూచించారు.

షబ్బీర్ అలీ నేతృత్వంలో ఢిల్లీలో కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు

- రాహుల్ గాంధీ పిలుపుతో రామ్‌లీలా మైదానంలో ఓట్ బచావో – దేశ్ బచావో కార్యక్రమానికి హాజరు.
- తెలంగాణ భవన్ నుంచి షబ్బీర్ అలీతో పాటు కార్యక్రమానికి బయలుదేరిన నాయకులు.



కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో– దేశ్ బచావో' కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా సంగతి తెలిసిందే.ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ నేతృత్వంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జిల్లా నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో షబ్బీర్ అలీ సమావేశమ య్యారు. అనంతరం వారితో కలిసి రామ్‌లీలా మైదానంలో జరిగే కార్యక్రమానికి బయలుదేరారు.

ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

రాజ్యాంగ విలువల సంరక్షణ అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం,ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత అవసరాన్ని తెలియజేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కామా రెడ్డి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తరలి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాహుల్ గాంధీ పిలుపు నకు స్పందిస్తూ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు తమ భాగస్వామ్యాన్ని చాటుతు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాలనీవాసుల అండ

- మానవత్వాన్ని చాటుకున్న హరిజనవాడ కాలనీవాసులు
- కష్టకాలంలో అండగా నిలవడమే నిజమైన మానవత్వం.

బిక్కనూరు, నవంబర్ 1 (తెహెల్కా న్యూస్)



బిక్కనూరు మండలం బస్వా పూర్ గ్రామానికి చెందిన తుడుం భూదమ్మ(90) అనా రోగ్యంతో ఆదివారం మరణి ంచారు. విషయం తెలుసు కున్న గ్రామంలోని హరిజన వాడ కాలనీ వాసులు ముందుకు వచ్చి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తుడుం భూదమ్మ కుటుంబానికి అండగా నిలవాలనే సదుద్దేశం తో కులపెద్దల సమక్షంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, సుఖసంతోషాల్లోనే కాకుండా కష్టసమ యాల్లోనూ ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిజనవాడ కాలనీ కులపెద్దలు, కాలనీ వాసులు, మృతురాలి బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌లీలా మైదానానికి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ఇందుప్రియ

- 'ఓట్ బచావో - దేశ్ బచావో ' ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం.
- రాహుల్ గాంధీ పిలుపుతో ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ శ్రేణులు.



కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో - దేశ్ బచావో ' కార్యక్రమంలో పాల్గొనేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఢిల్లీకి తరలివెళ్లారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, రాజ్యాంగ విలువల సంరక్షణ లక్ష్యంగా ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఐసీసీ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యం లో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్న గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ఇందుప్రియ అక్కడికి వచ్చిన కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమై రామ్‌లీలా మైదానానికి చేరుకున్నారు.

ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడం, ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తరలివెళ్లి కార్యక్రమానికి సంఘీభావం తెలుపు తున్నారని వివరించారు. ఓటు మన హక్కు.. ప్రజాస్వామ్యం మన బాధ్యత' అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రక్తదాన సేవలకు డాక్టర్ బాలుకు జాతీయ పురస్కారం

- ఢిల్లీలో మంత్రి కపిల్‌దేవ్ అగర్వాల్ చేతుల మీదుగా డాక్టర్ బాలుకు సత్కారం.
- 19 ఏళ్లుగా రక్తదాన కార్యక్రమాల్లో విశేష సేవలు, 30 వేలకుపైగా యూనిట్ల రక్తం సేకరణ.
- తలసేమియా చిన్నారుల కోసం 7 వేల యూనిట్ల రక్తం సేకరించిన డాక్టర్ బాలు.

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

రక్తదాన కార్యక్రమాల ద్వారా గత 19 ఏళ్లుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా కామారెడ్డికి చెందిన డాక్టర్ బాలుకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సమావేశంలో ఆయనకు 'శ్రీ రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్-2026' పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఉత్తరప్రదేశ్ వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి కపిల్‌దేవ్ అగర్వాల్, ఢిల్లీ భాజపా ఎమ్మెల్యే తిలక్‌రామ్ గుప్తా, ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, భాజపా సీనియర్ నాయకుడు శ్యామ్ జాజు చేతుల మీదుగా డాక్టర్ బాలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

2007 నుంచి రక్తదాన కార్యక్రమాలు



ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, 2007 నుంచి రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 30 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందించినట్లు పేర్కొన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా 7 వేల యూనిట్ల రక్తాన్ని తక్కువ సమయంలో సేకరించినట్లు వివరించారు. ఈ సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. తన ఎంపికకు సహకరించిన గంజి రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో పాటు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు అనిల్ అగర్వాల్, ఐవీఎఫ్ జాతీయ కోశాధికారి దినేశ్ చాంద్ గుప్తా, సెంట్రల్ కమిటీ సభ్యులు కక్కిరాల రమేశ్, నీల భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరలకు కళ్లెం.. గరిష్ఠ ధరలు ఖరారు!

- బీపీటీ, కేఎన్ఎం కిలో రూ.66గా నిర్ణయం
- తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ కిలో రూ.79.
- దుకాణాల్లో ధరల బ్యానర్లు తప్పనిసరి, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు.

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య వినియోగదారులకు ఊరట కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ రకాల బియ్యానికి గరిష్ఠ చిల్లర ధరలను (ఎంఆర్‌పీ) నిర్ణయించింది. బియ్యం విక్రయాల్లో పారదర్శ కత పెంచడంతో పాటు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేయ కుండా ఈ చర్యలు చేపట్టింది. పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చించిన అనంతరం ధరల ను ఖరారు చేశారు.

రకాల వారీగా గరిష్ఠ ధరలు..

ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో గరిష్ఠ ధర రూ.66గా నిర్ణయించారు. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాల ధర రూ.74గా, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల ధర రూ.79గా ఖరారు చేశారు. ఈ ధరలు బస్తా పరంగా కొనుగోలు చేసినప్పుడు వర్తిస్తాయని, విడిగా కొనుగోలు చేస్తే ధరల్లో వ్యత్యాసం ఉంటుందని



అధికారులు స్పష్టం చేశారు.

దుకాణాల్లో ధరల పట్టిక తప్పనిసరి

వినియోగదారులకు ధరలపై స్పష్టత కల్పించేందుకు బియ్యం మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో నిర్ణీత ధరలతో కూడిన బ్యానర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వినియో గదారులకు కనిపించే ప్రదేశాల్లో వాటిని ప్రదర్శించాలి. బ్యానర్ కుడివైపు దిగువన వ్యాపార సంస్థ పేరు నమోదు చేయాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరలకు మించి బియ్యం విక్రయించరాదని అధికారులు హెచ్చరించారు. ధరల అమలును పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించను న్నారు. తనిఖీల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

- కామారెడ్డి టౌన్-2 సెక్షన్ కార్యాలయంలో వినియోగదారుల ఫిర్యాదుల స్వీకరణ.
- నవంబర్ 3న - ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం.
- బిల్లులు, మీటర్లు, వోల్టేజీ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) ఆధ్వర్యంలో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరం-2) స్థానిక విచారణ సమావేశాన్ని నిర్వహించనున్నారు. నవంబర్ 3వ తేదీ మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కామారెడ్డి టౌన్-2 విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో సమావేశం జరగనుంది.

ఐదు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులకే అవకాశం

ఈ వేదిక ద్వారా కామారెడ్డి టౌన్-1, టౌన్-2, టౌన్-3, తాడ్వాయి, కామారెడ్డి రూరల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ లేదా అధిక వోల్టేజీ, కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ బిల్లుల్లో తప్పులు, మీటర్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. విద్యుత్ సేవలకు సంబంధించిన ఇతర సమస్యలను సైతం ఈ వేదికపై తెలియజేసి పరిష్కారం పొందవచ్చు. సంబంధిత ఐదు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు ఈ



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ కోరింది. సమస్యల పరిష్కారానికి నేరుగా అధికారులను సంప్రదించేందుకు ఈ సమావేశం ఉపయోగపడనుంది.

ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమరశంఖం







- రాహుల్ గాంధీ పిలుపుతో రామ్‌లీలా మైదానంలో 'ఓట్ బచావో
- దేశ్ బచావో' భారీ బహిరంగ సభ.
- కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు.
- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, తోట లక్ష్మీకాంతరావు.
- ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత, రాజ్యాంగ విలువలపై ర్యాలీ, భారీ బహిరంగ సభ.

కామారెడ్డి, నవంబరు 1 (తెహెల్కా న్యూస్)

ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లక్ష్యంగా ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన 'ఓట్ బచావో – దేశ్ బచావో ' భారీ బహిరంగ సభలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చాయి. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీ పిలుపు మేరకు సమన్వయంతో తరలివచ్చిన జిల్లా కాంగ్రెస్ ప్రజాస్వామ్యవాదులు సభలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు

ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తదితర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు సభకు హాజరయ్యారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలి

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రతి ఓటు విలువ కాపాడాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యానికి భరోసా కల్పించాలని సభ ద్వారా కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఓటర్ల జాబితాలు, ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణలో జవాబుదారీతనం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలి

ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో పారదర్శకతపై చర్చ జరగాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమం ద్వారా డిమాండ్ చేసింది. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఓటు హక్కును కాపాడుకుందాం..

ఢిల్లీలో నిర్వహించిన ఈ సభలో కామారెడ్డి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా జిల్లా కాంగ్రెస్ కమిటీలోని వివిధ స్థాయిల నాయకత్వం, కార్యకర్తల భాగస్వామ్యం కనిపించింది. జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో చేపట్టిన సమన్వయంతో పార్టీ శ్రేణులు ఒకే వేదికపైకి చేరాయి. సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలపై పార్టీ చేపట్టిన కార్యక్రమాలకు మద్దతు ప్రకటించారు. 'ఓటు హక్కును కాపాడుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములయ్యాయి.

ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద కేటీఆర్ కు ఘన స్వాగతం

- భారీ ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు.
- రూరల్ ఇంచార్జ్ బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు.

ఇందల్వాయి, నవంబర్ 1 (తెహల్కా న్యూస్)



అదిలాబాద్ జిల్లాలో రైతు గర్జన సదస్సుకు బయలుదేరి వెళుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావుకు ఆదివారం నిజామా బాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద రూరల్ ఇన్చార్జి మాజీ జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం తెలిపారు. స్వాగత కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ మండలంతో పాటు నిజామాబాద్ అర్బన్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అలాగే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ, ధర్పల్లి, డిచ్పల్లి, జక్రాన్ పల్లి,మోపాల్, తదితర మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతోపాటు సర్పంచ్లు, మాజీ సర్పంచు లు, మాజీ ఎంపీటీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఇన్చార్జ్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ., రైతులకు హరిగోశ పెడుతున్న కాంగ్రెస్ సర్కార్ 2028లో గల్లంతు కావడం ఖాయమని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చిలువరి గంగదాసు, ఉంగరాల శ్రీనివాస్, లింగంపల్లి రాజేందర్,నామల గంగాధర్, సక్కరి కొండ కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, పద్మారావు, మాజీ ఎంపీటీసీ చింతల దాసు, బొక్క గంగాధర్, క్రాంతి, శెట్టి బిరిష్, తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టాన్ని అతిక్రమించిన వ్యక్తికి జరిమాన

- ఇందల్వాయి ఆటవి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ వెల్లడి.

ఇందల్వాయి, నవంబర్ 1 (తెహల్కా న్యూస్)



ఇందల్వాయి ఆటవి రేంజ్ పరిధిలోని ధర్పల్లి మండలంలోని కోరాట్ పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఆదివారం రూ.19,200 జరిమానా విధించడం జరిగిందని ఇందల్వాయి ఆటవి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ., ధర్పల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో రహదారికి ఆనుకుని ఉన్న 38 కానుగ చెట్లను ప్రభుత్వ అనుమతి లేకుండా 2002 వాల్టా చట్టంను ఉల్లంఘించి చెట్లను నరికి వేసినట్లు పక్క సమాచారం మేరకు విచారణ జరుపగా కోరట్పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ నిందితునిగా గుర్తించి జరిమానా విధించడం జరిగిందని ఇందల్వాయి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ తెలిపారు. సుమారు ఐదు ఎడ్లబండ్ల వంట చెరుకును స్వాధీనం చేసుకొని ఇందల్వాయి రేంజ్ కార్యాల యానికి తరలించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి చెట్లను నరికిన వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు వేస్తామని ఎఫ్ఆర్ఓ రవి మోహన్ బట్ హెచ్చరించారు.